క్లుప్తంగా

కన్యాశుల్కంపై పోటీలు రేపు

విశాఖ విద్య: గురజాడ అప్పారావు వర్ధంతి పురస్కరించుకొని శనివారం కన్యాశుల్కం పాత్రలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ విద్యాసంస్థల అధినేత కృష్ణారెడ్డి తెలిపారు. ఎన్ఏడీలోని రామకృష్ణ విద్యా సంస్థల ప్రాంగణంలో ఆ రోజు ఉదయం 10గంటలకు విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. 8,9,10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. పూర్తి వివరాలకు 9866867610 లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పోర్ట్ చైర్మన్‌తో శ్రీధర్ భేటీ


పోర్ట్ చైర్మన్ అంగముత్తుతో శ్రీధర్

విశాఖ విద్య: విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్మన్ అంగముత్తుతో నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం భేటీ అయ్యారు. పోర్ట్ అథారిటీ చైర్మన్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా నగరంలో పోర్టు అథారిటీ సంబంధిత స్థలాల్లో రహదారి సౌకర్యాలు కల్పించాల్సిన దుర్గాపురం , సాకేతపురం, కాకాని నగర్, శ్రీ హరిపురం ,పారిశ్రామిక ప్రాంతం పరిధి కాలనీ వాసుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా చైర్మన్ స్పందించారని త్వరలో అధికారంగా ఆయా ప్రాంతాలలో పర్యటించి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని శ్రీధర్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం: శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధి పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జోన్ 2 ఈఈ బి.కె.నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్స్ సర్వీస్‌మెన్‌కాలనీ, జీవీఎంసీ ఆస్పత్రి ఏరియా, ఎంఐజీకాలనీ, ఎంఐజీ -2 కాలనీ, హనుమాన్ సంజీవ్‌కాలనీ, నెహ్రూనగర్, అశోక్‌నగర్, కొత్తనక్కవానిపాలెం ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరాలో అంతరాయం నెలకుంటుందన్నారు.

కంచరపాలెం సెక్షన్ పరిధిలో..

కంచరపాలెం: జోన్-2 డివిజన్ కంచరపాలెం సెక్షన్ పరిధి సబ్ స్టేషన్‌లో 11 కెవీ కంచరపాలెం ఫీడర్ లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని ఈఈ బీకె నాయుడు తెలిపారు. దుర్గానగర్, సుభాష్‌నగర్, తుమ్మడపాలెం, గోకుల్‌నగర్, గౌరీనగర్, తోటవీధి, మల్లసూరివీధి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ఆయా ప్రాంతాల ప్రజలు గమనించి సహకరించాలి కోరారు.

వైద్య శిబిరానికి స్పందన


శిబిరంలో విద్యార్థులతో వైద్యులు


కంచరపాలెం: కంచరపాలెం ఇండస్ట్రీయల్ ఎస్టేట్ కేంద్రీయ విద్యాలయంలో రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో సంయుక్త ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ అగర్వాల్ నేత్ర వైద్య పరీక్షలు చేసి ఉచితంగా కళ్ల జోళ్లు, మందులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గంగాధర్, క్లబ్ కార్యదర్శి రొటేరియన్ రాజేష్, ప్రాజెక్ట్ డైరెక్టర్స్ షీలా, సుష్మా, ప్రశాంతి, రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ సునీతలావణ్య, పూర్వ అధ్యక్షుడు కె.కిరణ్‌కుమార్, బైరెడ్డి, పిబిఎస్ఎన్ రెడ్డి, క్లబ్ మెడికల్ డైరెక్టర్ ఒమ్మి కిరణ్‌కుమార్ వైద్యులు రాజు, శ్రీనివాస్‌రెడ్డి హరిత, నగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెడ్డల మరమ్మతులకు మోక్షమెప్పుడో?

- శిథిలావస్థలో కాలువలు
- ఆక్రమణకు గురవుతున్నా పట్టని వైనం
- ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం


గొల్లకంచరపాలెంలో శిథిలావస్థలో కాలువ


వార్డులో ఆక్రమణకు గురవుతున్న సుభాష్‌నగర్ గెడ్డ


56వ వార్డు దుర్గానగర్‌లో గెడ్డ రక్షణగోడ దుస్థితి

కంచరపాలెం: ఓ వైపు నగరంలో అతిసార భయపెడుతోంది.మరోవైపు పారిశుధ్య నిర్వహణ గాడితప్పింది. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గెడ్డలు, కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపంతో అధ్వానంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో గెడ్డలు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకునే అధికారి కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీ 56,57 వార్డు పరిధి కంచరపాలెం, ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్, 104ఏరియా, మర్రిపాలెం పరిధిలో సుభాష్‌నగర్, తుమ్మడపాలెం, గొల్లకంచరపాలెం దుర్గానగర్ ప్రాంతాల్లో కాలువలు, గెడ్డలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గెడ్డల్లో డెబ్రీస్ అడ్డంగా ఉండడంతో పూడికలతో నిండిపోతున్నాయి. దీంతో దోమలు విజృంభించి, తరచూ వ్యాధులు బారిన పడుతున్నామని ఆయా వార్డు ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ సుభాష్‌నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు దుర్గంధభరిత వాతావరణంలో చదువులు అభ్యసించాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గెడ్డలు ఆక్రమణకు గురవడంతో పారిశుధ్యం మెరుగుకు ఇబ్బందికరంగా మారుతోందని పబ్లిక్‌హెల్త్ సిబ్బంది చెబుతున్నారు. గెడ్డల పునఃనిర్మాణానికి జోన్-5 ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించి నిర్మాణ పనులు చేపట్టాలని ఆయా వార్డు ప్రజలకు కోరుతున్నారు.

గెడ్డలు శిథిలం..ఆక్రమణ

- కంచరపాలెం బీఆర్‌టీఎస్ నేతాజీ గ్రంథాలయ రహదారి గెడ్డ నుంచి దయానందనగర్ చాకలిగెడ్డకు వెళ్లే గెడ్డలు కుదించుకుపోయాయి. రైల్వేట్రాక్‌కు వెళ్లే గెడ్డలు శిథిలావస్థకు చేరుకున్నాయి.
- గొల్లకంచరపాలెం నుంచి తోటవీధి, దుర్గానగర్‌కి వెళ్లే కాలువల గోడలు శిథిలావస్థకు చేరడంతో మురుగు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది.
- దుర్గానగర్ నుంచి గౌరీనగర్‌కు వెళ్లే గెడ్డలకు ఆనుకుని ఉన్న రైల్వే రక్షణగోడ కూలి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పట్టించుకునే నాథుడు కనిపించడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- ఊర్వశికూడలి సుభాష్‌నగర్ నుంచి ఐటీఐ జంక్షన్ భవానిగార్డెన్‌కు వెళ్లే గెడ్డల్లో సుభాష్‌నగర్ పాఠశాలకు ఆనుకుని గెడ్డను ఆక్రమించే ఉద్దేశ్యంతో డెబ్రీస్‌లు వేస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

కాలువలు మెరుగుపరచాలి

వార్డులో ఎక్కడ చూసినా గెడ్డలు, కాలువలు శిథిలావస్థకు చేరాయి. వీటికి మరమ్మతులు చేపట్టాలని జోనల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదు. మురుగు సక్రమంగా పారకపోవడంతో దుర్గంధభరితంగా ఉంటుంది. దోమలు విజృంభించడంతో రోగాలతో సతమతమవుతున్నాం.

–ఎస్.ఎస్. శంకరరావు, గౌరీనగర్, కంచరపాలెం

ఆక్రమణల నుంచి కాపాడండి

సుభాష్‌నగర్ గెడ్డలు ఆక్రమణకు గురవుతున్నాయి. స్థానికులు గెడ్డకు ప్రధాన ద్వారాల వద్ద డెబ్రీస్‌లు వేస్తుండడంతో మురుగు ప్రవాహానికి ఆటంకంగా మారుతోంది. ముందుగా ఇంటి నిర్మాణ వ్యర్థాలు వేసి ఆక్రమణలు చేస్తున్నారు. పబ్లిక్‌హెల్త్ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ లోపంతో గెడ్డలు ఆక్రమణకు గురవుతున్నాయి. సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకుని వెళ్తాం.

–టి.రాంబాబు, సుభాష్‌నగర్, ఊర్వశికూడలి

కుటుంబం చెంతకు వృద్ధురాలు


వృద్ధురాలితో మమత

విశాఖ విద్య: ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తొన్న వృద్ధురాలిను వారి కుటుంబం చెంతకు చేర్చేలా మమత చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ ఎల్లేటి మమత ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నగరంలోని డాల్ఫిన్ హోటల్ దగ్గర ఫుట్ పాత్ మీద చలికి వణికిపోతూ నిస్సాహాయ స్థితిలో ఉండడం గమనించిన స్థానికులు మమత చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు మమతకు సమాచారం ఇచ్చారు. మమత అక్కడకు వెళ్లి ఆ వృద్ధురాలికి మన కుటుంబం వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. అంతే కాకుండా ఆ వృద్ధురాలు వివరాలు ఆరా తీయడంతో పేరు రాములమ్మ అని, ఊరు విజయనగరం దగ్గర జక్కువ అని చెప్పడంతో వారి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేసింది. వారు గురువారం విశాఖ వచ్చి ఆమెను తీసుకెళ్లారు. రాములమ్మను క్షేమంగా అప్పగించినందుకు మమత, మన కుటుంబం వృద్ధాశ్రమ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు

ఘనంగా షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం


ధర్మశ్రీని సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

విశాఖ విద్య: గోపాలపట్నం ప్రశాంత్ నగర్‌లో శ్రీ షిర్డీసాయి మందిరం 28వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. మండపారాధన, 1,008 కలశాలతో అభిషేకం, హోమం నిర్వహించారు. ఉదయం 7గంటలకు కాలనీ వాస్తవ్యులు జగన్నాథరావు మాస్టర్ కుటుంబ సభ్యులు సాయిబాబాకు ఇత్తడి మకరతోరణాన్ని చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీతో కలిసి బహూకరించి ప్రత్యేకపూజలు చేశారు. వేడుకలో స్థానిక ఎమ్మెల్యే గణబాబు పాల్గొన్నారు. సాయిమందిరం సేవా సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాశ్ రావు, కార్యదర్శి మధుసూదన రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

అంతర్ కళాశాలల ఖోఖో పోటీలు ప్రారంభం


క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో గురువారం అంతర్ కళాశాలల ఖోఖో పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానం వేదికగా జరుగుతున్న క్రీడా పోటీలను ముఖ్య అతిథి ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు ప్రారంభించారు. క్రీడాకారులతో కరచాలనం చేసి ప్రోత్సహించారు. ఆయా క్రీడల్లో ఉన్నతంగా రాణించి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయి గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు. ఏయూ స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్ మాట్లాడుతూ ఖోఖోలో 28 కళాశాలకు చెందిన 30 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. వీరిని 16 టీమ్‌లుగా విభజించి పోటీలు నిర్వహించారు.

పశుగణనకు సహకరించండి


పశువైద్యశాలలోని రికార్డులు తనిఖీ చేస్తున్న ఉపసంచాలకులు చంద్రశేఖర్


ఏకేసీకాలనీలోని పాడి రైతుల నుంచి వివరాలను తెలుసుకుంటున్న చంద్రశేఖర్

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి గాంధీగ్రామం పశువుల ఆస్పత్రిని జిల్లా ఉపసంచాలకులు చంద్రశేఖర్ గురువారం సందర్శించారు. పశువైద్యశాల ఆవరణను తనిఖీ చేయడంతో పాటు అక్కడి రికార్డులను, పారిశ్రామిక ప్రాంతంలో జరుగుతున్న పశుగణన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం 40వ వార్డు ఏకేసీకాలనీలోనూ, 61వ వార్డు రామకృష్ణాపురంలోనూ పాడి రైతుల ఇళ్లకు వెళ్లి పాడిపశువుల వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 21వ పశుగణన కార్యక్రమం 4 నెలలు పాటు జరుగుతుందని, పాడి రైతులు పశువుల వివరాలను సమగ్రంగా ఎన్యూమరేటర్లకు అందజేస్తే మందులు, టీకాలు, అందించగలమన్నారు. పశుగణనను పక్కాగా నిర్వహించాలని, వాటి వివరాలను ఎప్పటికప్పుడూ ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని ప్రాంతీయ పశువైద్యశాల వైద్యులు సునీల్‌కుమార్‌కు సూచించారు.

ఫార్మా మృతుని కుటుంబానికి రూ.కోటి చెల్లించాలి


మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సిటు నేత కుమార్


దాబాగార్డెన్స్: పరవాడ స్పెషల్ ఎకనామిక్ జోన్‌లోని ఠాగూర్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీలో గ్యాస్ లీకై మృతి చెందిన కార్మిక కుటుంబానికి రూ.కోటి చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సిటు విశాఖ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతి చెందిన కుటుంబ సభ్యులను కేజీహెచ్ మార్చురీ వద్ద ఆయన పరామర్శించారు. ఫార్మా పరిశ్రమలో అనునిత్యం ప్రమాదాలు జరిగి కార్మికులు చనిపోతున్నా ఏ విధమైన చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే రెండు పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగి 21 మంది చనిపోయారన్నారు. ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి, జిల్లా ఉన్నతాధికారులు ఉన్నత స్థాయి అధికారులతో కమిటీ వేశామని చెప్పారన్నారు. కానీ ఆ కమిటీ చేసిన సిఫార్సులను ఇంత వరకు బహిర్గతం చేయలేదని ఆరోపించారు. వాటి సూచనలు అమలు చేయలేదన్నారు. ప్రమాదం జరిగిన ఏ పరిశ్రమ యాజమాన్యాన్ని అరెస్టులు చేయడం, శిక్షించడం గానీ చేయడం లేదని, దీంతో యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు గాలికి వదిలేస్తున్నారని మండిపడ్డారు. కార్మికుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందని, ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా యాజమాన్యాలు తగిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం ఆదేశించాలన్నారు. నిరంతరం సేఫ్టీ ఆడిట్ జరపాలని, ప్రమాదం జరిగితే తర్వాత హడావిడి చేసే కంటే ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టాలని సిటు డిమాండ్ చేస్తుందని, తక్షణమే ప్రమాదానికి కారణమైన యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

నోటీసులు వెనక్కి తీసుకోవాలని నిరసన


జీవీఎంసీ గాంధీ పార్కులో దీక్ష చేస్తున్న కార్మికులు

సీతమ్మధార: ఎం.జి.ఎం. సెవెన్ హిల్స్ యాజమాన్యం కార్మికులకు ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకుని, యథావిధిగా వారిని కొనసాగించాలని జిల్లా హాస్పిటల్ అండ్ నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి వై. రాజు డిమాండ్ చేశారు. ఎంజీఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ కార్మిక వ్యతిరేక చర్యలను అరికట్టాలని, లేబర్ డిపార్ట్‌మెంట్ పక్షపాత వైఖరి విడనాడాలని, ఆ డిపార్ట్‌మెంట్ నిద్రపోతుందని పేర్కొంటూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో రాజు మాట్లాడుతూ నెల రోజులుగా ఎంజీఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ కార్మికుల అక్రమ తొలగింపునకు నిరసనగా ఆందోళన చేస్తున్నారని తెలిపారు. లేబర్ కమిషనర్‌కి సమ్మె నోటీస్ ఇచ్చినట్లు తెలిపారు. డీఎల్‌సీ పక్షపాత వైఖరి అరికట్టాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అయితే ఇంత వరకు కార్మికుల గోడు పట్టించుకునే నాథుడే లేడన్నారు. లేబర్ కమిషనర్ రెండు సార్లు యాజమాన్యంతో జాయింట్ మీటింగ్ పెట్టినా సెవెన్ హిల్స్ యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలపై మాట్లాడలేదని ఆరోపించారు. దీనిని బట్టి సెవెన్ హిల్స్ యాజమాన్యం పట్ల లేబర్ కమిషనర్‌కి ఎంత ఆపేక్ష ఉందో అర్థం అవుతుందని ఎద్దేవా చేశారు. దీక్షలో సంఘం నాయకులు కె. చంద్రశేఖర్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో వేద వర్ధన తీర్థ స్వామీజీ


స్వామీజీకి అప్పన్న జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఉడిపిలోని శిరూర్ మఠానికి చెందిన వేద వర్ధన తీర్థ స్వామీజీ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ అందించారు.

జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయం


శ్రీహరిపురం పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు,విద్యార్థులు


జ్యోతిరావు పూలేకు నివాళులర్పిస్తున్న మళ్ల విజయప్రసాద్ తదితరులు


పేదలకు రగ్గులు పంపిణీ చేస్తున్న గొల్లమాల అప్పారావు

మల్కాపురం: మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని పారిశ్రామిక ప్రాంతంలో గురువారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మళ్ల విజయప్రసాద్ పాల్గొని జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీసీ వర్గానికి ఆయన చేసిన సేవలను కీర్తించారు. కార్యక్రమంలో పలు వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, పీవీ సురేష్, బల్లా లక్ష్మణరావు, ముర్రు వాణితో ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు ఆడారి శ్రీను, గులిగిండల కృష్ణ, రేవళ్ల సత్యనారాయణ, కేబుల్ వాసు, నమ్మి శ్రీను, శ్యామ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు ప్రకాష్, బీజేపీ నాయకుడు పెద్దిరెడ్ల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత జ్యోతిరావు పూలే

కంచరపాలెం: సమ సమాజ స్థాపనలో భావితరాలకు స్ఫూర్తిప్రదాతగా నిలిచిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు కొనియాడారు. ఊర్వశి కూడలిలోని దళిత సేన కార్యాలయంలో గురువారం పూలే వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలు, వృద్ధులకు గొల్లమాల అప్పారావు పండ్లు, రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దళిత సేన నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, నగర మహిళా కన్వీనర్ గొల్లమాల మీనా, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారామ్, నగర ప్రధాన కార్యదర్శి సిహెచ్.మల్లికార్జునరావు, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

59వ వార్డులో ఎమ్మెల్యే పర్యటన


కొండవాలు ప్రాంతంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: ఎమ్మెల్యే గణబాబు గురువారం 59వ వార్డు కొండవాలు ప్రాంతాలలో పర్యటించారు. కార్యక్రమంలో భాగంగా ఆయన గణపతినగర్, హిమచల్‌నగర్ కొండ ప్రాంతాలకు వెళ్లి అక్కడ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఆయా ప్రాంత వాసులు రక్షణ గోడలను ఏర్పాటు చేయ్యాలని, మంచినీటి ఇబ్బందిగా ఉందని ఇలా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయా విభాగాల అధికారులతో మాట్లాడి కొండవాలు ప్రాంతాలలో రక్షణ గోడల నిర్మాణానికి అవసరమైన చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-5 జెడ్సీ రాముతో పాటు పలు విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంపై ప్రవచనాలు

సీతమ్మధార: ధ్యానంపై అరుణాజీ ప్రవచనాలు ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నవంబర్ 30, డిసెంబర్ 1న జరుగుతాయని ఫౌండేషన్ కోశాధికారి కె. భారతి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. నిష్కామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ధ్యానం నిర్విషయ నమః 'అనే అంశంపై లెక్చర్ సిరీస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అవగాహనతోనే రొమ్ము క్యాన్సర్ నివారణ


మాట్లాడుతున్న సీతామాణిక్యం

విశాఖ విద్య: మహిళలు అవగాహన పెంచుకుని వైద్య పరీక్షలు చేసుకుంటే రొమ్ము క్యాన్సర్‌ను నివారించవచ్చని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం అన్నారు. జాతీయ సేవా పథకం, యువరాజ్ సింగ్ ఫౌండేషన్, దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం సంయుక్తంగా గురువారం ఎన్ఎస్ఎస్ సమావేశంలో నిర్వహించిన రేడియేషన్ లేని రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఆమె ప్రారంభించి, మాట్లాడారు. రొమ్ము క్యాన్సర్ ఇటీవల గణనీయంగా పెరుగుతోందని, తగిన జాగ్రత్తలు వహిస్తూ తరచూ పరీక్షలు చేయించుకుంటూ మహిళలు సురక్షితంగా ఉండాలని సూచించారు. ఆధునిక పరికరాలు, చికిత్స విధానాలు అందుబాటులోకి వచ్చాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎ.పల్లవి మాట్లాడుతూ యువతులు, మహిళలు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శిబిరంలో 130 మందికి పైగా మహిళలు, యువతులు పరీక్షలు చేయించుకున్నారు.

మోసం కేసులో వ్యక్తికి జైలు శిక్ష


నిందితుడు రామ్‌చరణ్

అక్కిరెడ్డిపాలెం: ఉద్యోగం ఎర చూపి మహిళ నుంచి బంగారం కాజేసిన వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించింది. గాజువాక ఎస్ఐ టి.రవికుమార్ గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2022 డిసెంబర్ 7న మజ్జి బొర్రమ్మ ఆటోలో అనకాపల్లి నుంచి గాజువాక వచ్చింది. ఆటోలో మహిళను అనకాపల్లి జిల్లా లంకెలపాలెం వాంబేకాలనీకి చెందిన బండారు రామ్ చరణ్.. ఉరఫ్ కుమార్ పరిచయం చేసుకుని ఎయిర్‌టెల్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో ఆమె ఇంటర్వ్యూకు హాజరయ్యే ముందు రామ్‌చరణ్‌ను కార్యాలయం వద్ద కలిసింది. ఇంటర్వ్యూ సమయంలో బంగారం వస్తువులు ఉండకూడదని నమ్మించి ఆమె వద్ద ఉన్న మూడున్నర తులాల పుస్తెల తాడు, 4 తులాల హారం, 2 తులాల కాసులపేరు తీసుకుని అక్కడ నుంచి పరారయ్యాడు. దీనిపై మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడ్ని అరెస్ట్ చేసిన గాజువాక పోలీసులు మూడవ అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి పల్లవి ఎదుట హాజరుపర్చగా 11 నెలల 21 రోజులు జైలు శిక్షను విధించినట్లు ఎస్ఐ టి.రవికుమార్ తెలిపారు.

బాల్య వివాహాల నిర్మూలనే ధ్యేయం


అవగాహన ర్యాలీ చేస్తున్న మహిళలు

జగదాంబ: బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని రూపొందించడానికి అందరం కలిసికట్టుగా పని చేద్దామని ఎక్సెస్ టూ జస్టిస్ ఫర్ చిల్డ్రన్ ఆఫ్ హోల్డ్ ఎన్‌జీవో జిల్లా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డేవిడ్‌రాజు అన్నారు. భారత ప్రభుత్వం ప్రారంభించిన బాల్య వివాహ ముక్త్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అయిదు వందల మందితో కలిసి జగదాంబ జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డేవిడ్‌రాజు మాట్లాడుతూ బాల్య వివాహాలు సాంఘిక దురాచారం, నేరమని అన్నారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.